సాక్షి నిజామాబాద్

సోమవారం | 12 | ఆగస్టు | 2024



ముందుకు కదలని స్పైస్ పార్క్

వేల్పూర్ క్రాస్‌రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన స్పైస్ పార్క్‌లో క్రయ విక్రయాలు ప్రారంభం కాక పోవడంతో నామమాత్రంగా మారింది.

- 8లో ▸



మళ్లీ డిప్యుటేషన్లు!

వైద్యారోగ్య శాఖలో డిప్యుటేషన్ల అంశం మళ్లీ తెరపైకి వచ్చింది. నచ్చిన చోటుకు వెళ్లడానికి కొందరు పైరవీలను ప్రారంభించారు.

- 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం

32.8 /24.9

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. చల్లని గాలులు వీస్తాయి. అక్కడక్కడ ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశా లున్నాయి.

న్యూస్‌రీల్

రైతుల సంక్షేమానికి కృషి చేస్తా



డిచ్‌పల్లి : రైతుల సంక్షేమం కోసం తన శక్తి మేర కృషి చేస్తానని డీసీఎంఎస్ చైర్మన్ తారా చంద్‌నాయక్ పేర్కొన్నారు. చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించి మొదటిసారిగా ఆదివారం ఆయన డిచ్‌పల్లి మండలం రాంపూర్‌కు వచ్చారు. ఆయనకు వీడీసీ ఆధ్వర్యంలో స్వాగతం పలికి సన్మానించారు. ఈ సందర్భంగా తారాచంద్ నాయక్ మాట్లాడుతూ.. కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం సాధ్యమన్నారు. మాజీ ఎంపీపీలు కంచెట్టి గంగాధర్, నర్సయ్య, నాయకులు పోలసని శ్రీనివాస్, ఎంకనోల్ల రమేష్, రఘునాథన్ రాము, తిరుపతి, ఆశన్న, బాల్‌రామ్ నాయక్, చింతల దాస్, రాజ్‌కుమార్, బొక్క గంగాధర్, మేకల రమేశ్, లచ్చమొల్ల దత్తాద్రి, ఇన్‌చార్జి సీఈవో నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పొరపాట్లను సరిదిద్దాలి

నిజామాబాద్ అర్బన్: ఉపాధ్యాయ పదోన్నతుల్లో సాంకేతిక కారణాలతో జరిగిన పొరపాట్లను సరిదిద్ది ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని పీఆర్టీయూ తెలంగాణ జిల్లా అధ్యక్షుడు కృపాల్‌సింగ్ డిమాండ్ చేశారు. నగరంలోని యూనియన్ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బదిలీ అయి రిలీవ్ కాని ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయలన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రాథమిక పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్ సమాన స్థాయి పీఎస్‌హెచ్‌ఎం పోస్టులను మంజూరు చేయాలన్నారు. గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల పోస్టులను అర్హులైన స్కూల్ అసిస్టెంట్లకు పదోన్నతి కల్పించి భర్తీ చేయలన్నారు. సమావేశంలో సంఘం నాయకులు వాసుదేవరావు, నల్లోల్ల గంగాధర్, జావీద్, భూషణ్, సత్యనారాయణ, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఈనెల 15 తర్వాతే చేపపిల్లల ఉత్పత్తి

బాల్కొండ : శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ దిగువన గల జాతీయ చేప పిల్లల కేంద్రంలో చేప పిల్లల ఉత్పత్తి ఈనెల 15 తర్వాతే ప్రారంభించే అవకాశం ఉంది. చేప పిల్లల ఉత్పత్తికి కావాల్సిన సామగ్రి కోసం రూ.4.5 లక్షలు అవసరం అని అధికారులు ప్రతిపాదనలు పంపారు. కానీ ప్రభుత్వం తరఫున కలెక్టర్ రూ.లక్ష మాత్రమే అందించారు. ఈ నిధులతో ఆదివారం సామగ్రి కొనుగోలు చేస్తున్నారు. ఈ నెల 15 తర్వాత ప్రారంభిస్తే 15 రోజులు మాత్రమే ఉత్పత్తి జరుగుతుంది. చేప పిల్లల ఉత్పత్తికి కావాల్సిన నీరు ఉన్నప్పటికీ ఇప్పటి వరకు ప్రక్రియ ప్రారంభించలేదు. ఉత్పత్తి కేంద్రం మత్స్య అభివృద్ధి అధికారి లాయక్ మొహినొద్దీన్ సైతం సెలవులో ఉన్నారు. ప్రస్తుతం ఫీల్డ్‌మెన్‌ల ద్వారానే ప్రక్రియ కొనసాగుతోంది.

జిల్లాలో కొత్తగా 15 జీపీలు ఏర్పాటు

సుభాష్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో 15 కొత్త గ్రామ పంచాయతీలు, 109 వార్డు స్థానాలు ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో జిల్లాలో 530 గ్రామపంచాయతీలు, 4392 వార్డుస్థానాలు ఉండేవి. జిల్లాలోని ఆర్మూర్, బాన్సువాడ నియోజకవర్గాల్లో కొత్త గ్రామపంచాయతీలు ఏర్పడ్డాయి. ఆర్మూర్ మండలం పల్లె, మాక్లూర్ మండలం రామేశ్వర్ క్యాంపు, మెట్టు, నందిపేట మండలం జోజిపేట్, రైతుఫారం, కోటగిరి మండలం జల్లపల్లి తండా, జల్లపల్లి(వి), బాకర్ ఫారం, ఎస్‌ఆర్ కాలనీ, తిర్మలాపూర్, ఎక్లాస్‌పూర్ క్యాంపు, ఎత్తొండ క్యాంపు, పీఎస్‌ఆర్ నగర్, వర్ని మండలం రూప్లానాయక్ తండా, రుద్రూర్ మండలం కొందాపూర్ నూతన జీపీలుగా ఏర్పడ్డాయి.

కులాలకతీతంగా ఏకమవ్వాలి



కామారెడ్డి అర్బన్: ఏ కులమైనా, ఏ దైవాన్ని కొలిచినా హిందువులంతా ఒక్కటిగా ఉంటేనే బలమైన శక్తిగా ఉంటామని విశ్వహిందూ పరిషత్ భాగ్యనగర్ క్షేత్ర సంఘటన మంత్రి గుమ్మళ్ల సత్యం పేర్కొన్నారు. విశ్వహిందూ పరిషత్ 60 ఏళ్ల మహోత్సవాల సందర్భంగా కామారెడ్డిలోని శిశుమందిర్‌లో రెండు రోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి సమావేశాలు ఆదివారంతో ముగిశాయి. ఆయన మాట్లాడుతూ.. హిందు సమాజంపై దాడులు సాధారణంగా మారిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. వీహెచ్‌పీ తెలంగాణ ప్రాంత కార్యదర్శి పి లక్ష్మీనారాయణ, జిల్లా అధ్యక్షుడు నిత్యానందం, రాజు, వెంకటస్వామి, ప్రసాద్ పాల్గొన్నారు.

లీగల్ ఒపీనియన్ పేరిట పావులు!

- 2014 నియామకాలను సక్రమం చేసుకునేందుకు మరో గేమ్
- వక్రమార్గాల్లో ప్రయత్నాలు చేస్తున్న రిజిస్ట్రార్
- పాలకమండలి నిర్ణయాలను తుంగలో తొక్కుతున్న వైనం





సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : తెలంగాణ యూనివర్సిటీలో వివాదాస్పద 2014 నియామకాలను గుట్టుచప్పుడు కాకుండా సక్రమం చేసుకునేందుకు రిజిస్ట్రార్ ఆధ్వర్యంలో పావులు కదుపుతున్నారు. వర్సిటీ వీసీగా ఉన్న రవీందర్‌గుప్తా అరెస్టుతో పాలన గాడిలో పడుతుందనుకున్నప్పటికీ పరిస్థితి మరింత దిగజారుతోంది. రెగ్యులర్ వీసీ లేకపోవడంతో ప్రస్తుత రిజిస్ట్రార్ యాదగిరి మరో తరహా అక్రమానికి తెర తీసినట్లు వర్సిటీలో చర్చించుకుంటున్నారు. నిబంధనలు తుంగలో తొక్కి 2014 నియామకాల అభ్యర్థులకు పదోన్నతులు కల్పించేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నట్లు సమాచారం. గతంలో విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ బుర్రా వెంకటేశం వర్సిటీకి ఇన్‌చార్జి వీసీగా పనిచేసిన సమయంలోనే ఈ విషయమై తప్పుదారి పట్టించడం గమనార్హం. ఐఏఎస్ అధికారులకు ఈ నియామకాల అంశంపై పూర్తి సమాచారం ఉండదని, దీంతో ఏదో విధంగా నమ్మించి వీరికి ఆమోద ముద్ర వేయించడానికి యత్నిస్తున్నారు.

గుట్టుచప్పుడు కాకుండా..

ప్రభుత్వ ప్లీడర్ వాణిరెడ్డి ఒపీనియన్‌ను అధ్యయనం చేసి, నియామకాలను ఎందుకు రద్దు చేయకూడదో తెలియజేయాలని కోరుతూ 2014 నియామక అభ్యర్థులకు నోటీసులు జారీ చేయాలని అప్పటి వీసీ, రిజిస్ట్రార్‌లను పాలకమండలి ఆదేశించింది. ఇలా ప్రతి పాలకమండలి సమావేశంలో తిరస్కరణకు గురైన వివాదాస్పద నియామకాలకు విద్యాశాఖ కార్యదర్శితో ప్రస్తుత రిజిస్ట్రార్ యాదగిరి ఏవిధంగా లీగల్ ఒపీనియన్ తీసుకునేలా ఒప్పించారనేది ప్రశ్నార్థకంగా ఉంది. మొదటి లీగల్ ఒపీనియన్ తీసుకునేముందే పాలకమండలి అనుమతి కోరారు. మరి ఇప్పుడు పాలకమండలిని ఎందుకు మరిచారో. పూర్తి స్థాయిలో పాలకమండలి లేని సమయంలో ఆగమేఘాల మీద గుట్టుచప్పుడు కాకుండా లీగల్ ఒపీనియన్‌కు ఎందుకు పంపారనేది తెలియాలని పలువురు అంటున్నారు. 2019 మార్చి 30న జరిగిన 44వ పాలకమండలి సమావేశంలో కూడా ఈ అంశం ప్రస్తావన వచ్చింది. తర్వాత తమకు పదోన్నతి కల్పించాలని కోరుతూ వివాదాస్పద 2014 అభ్యర్థులు పెట్టుకున్న వినతిని 48వ పాలకమండలి సమావేశం తోసిపుచ్చింది.

తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు 2014 నియామకాల విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోవద్దని ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి నుంచి 2022 జూలై 13న లేఖ వచ్చింది. ఇన్ని పరిణామాల నేపథ్యంలో రిజిస్ట్రార్ యాదగిరి గత ఇన్‌చార్జి వీసీ బుర్రా వెంకటేశంకు అన్నింటినీ దాచిపెట్టి లీగల్ ఒపీనియన్ పేరుతో దాదాపు రూ.2 లక్షల వర్సిటీ ధనాన్ని వృథా చేయడం గమనార్హం. 2014 నియామకాల పూర్వాపరాలను బుర్రా వెంకటేశంకు ఎందుకు వివరించలేదో, హైకోర్టు తుది తీర్పు వచ్చేవరకు ఆగకుండా ఎందుకంత హడావుడి చేస్తున్నారో అనేది అంతుపట్టడం లేదు. 2014లో నియామకమైనవారి పదోన్నతులకు ఆమోదముద్ర వేయించుకునేందుకు ప్రస్తుత వీసీ సందీప్‌కుమార్ సుల్తానియాను త్వరలో కలవనున్నట్లు తెలిసింది.

అక్రమాలు జరిగినట్లు గుర్తింపు

నియామకాల వ్యవహారం అనేక మలుపులు తిరుగుతూ వివాదాస్పదంగా తయారైంది. ఈ విషయమై జస్టిస్ సీవీ రాములు ఇచ్చిన నివేదికపై అప్పటి గవర్నమెంట్ ప్లీడర్ (ఉన్నత విద్యాశాఖ) వాణిరెడ్డి ద్వారా లీగల్ ఒపీనియన్ కోరుతూ 41వ పాలకమండలి సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఆ తర్వాత ఈ నియామకాలపై జస్టిస్ సీవీ రాములు నేతృత్వంలో ఏకసభ్య కమిషన్‌ను ఏర్పాటు చేశారు. 2018 సెప్టెంబర్ 26న జరిగిన పాలకమండలి సమావేశంలో జస్టిస్ సీవీ రాములు ఇచ్చిన నివేదికను పరిశీలించిన పాలకమండలి, ఆయా నియామకాల్లో అక్రమాలు జరిగాయని గుర్తించింది. దీన్ని తీవ్రంగా పరిగణించి, సదరు నియామకాలు చేపట్టిన అప్పటి వీసీ అక్బర్ అలీఖాన్, రిజిస్ట్రార్ అశోక్‌పై ఉస్మానియా యూనివర్సిటీ సర్వీస్ రూల్స్ ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆ వర్సిటీకి లేఖ రాయాలని తెలంగాణ వర్సిటీ వీసీ, రిజిస్ట్రార్‌లను పాలకమండలి సభ్యులు ఆదేశించారు. అక్బర్ అలీఖాన్ పెన్షన్ బెనిఫిట్స్‌ను పూర్తిగా నిలిపేయాలని, అశోక్‌ను సర్వీస్ నుంచి తొలగించాలని ఉస్మానియా వర్సిటీకి లేఖ రాయాలని నిర్ణయించారు. యాక్షన్ టేకెన్ రిపోర్ట్‌ను ఉస్మానియా వర్సిటీ నుంచి తెప్పించుకోవాలని ఆదేశించారు. జస్టిస్ సీవీ రాములు నివేదిక ప్రకారం అక్బర్ అలీఖాన్, అశోక్‌లపై సత్వరమే క్రిమినల్ కేసు పెట్టాలని తెలంగాణ వర్సిటీ వీసీ సాంబయ్య, రిజిస్ట్రార్ బలరాములును పాలకమండలి ఆదేశించింది.

ఆది నుంచి వివాదాస్పదమే..

వాస్తవానికి 2014 నియామకాలు ఆది నుంచి వివాదాస్పదమే. దీనిని కప్పిపుచ్చి రిజిస్ట్రార్ అడ్డగోలుగా ఆమోదముద్రలు వేయిస్తున్నారు. తెయూలో 2012 ఏడాది చివరలో ఇంటర్వ్యూలు నిర్వహించి, 2013 ఫిబ్రవరిలో పలువురికి నియామక పత్రాలు ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. అందుబాటులో ఉన్నవాళ్లను జాయిన్ చేసుకున్నప్పటికీ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో సదరు నియామకాలకు బ్రేక్ పడింది. ఈ క్రమంలో నియామకాల్లో అక్రమాలపై విద్యార్థి సంఘాలు సాక్ష్యాలు బయటపెట్టడం, పత్రికల్లో కథనాలు రావడంతో పాటు అర్హత ఉన్నప్పటికీ ఎంపిక కాని కొందరు ప్రభుత్వానికి వినతిపత్రం ఇవ్వడం, పైగా ఇక్కడే పనిచేస్తున్న అకడమిక్ కన్సల్టెంట్లు ఆందోళనలకు దిగడంతో అప్పటి ప్రభుత్వం ఈ నియామకాలపై సమగ్ర విచారణ జరిపేందుకు 2013 ఫిబ్రవరి 22న ఇద్దరు సభ్యుల కమిటీని నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. ఆ తర్వాత 2013 ఫిబ్రవరి 25న ఈ నియామకాలకు సంబంధించి తదుపరి ఉత్తర్వులు వెలువరించవద్దని అప్పటి ప్రభుత్వం నిషేధం విధించింది. ఇదే సమయంలో అటు అకడమిక్ కన్సల్టెంట్లు సైతం ఈ నియామకాలపై హైకోర్టు నుంచి స్టే తెచ్చారు.

లీకేజీపై పట్టింపేది?



ప్రాజెక్ట్ గేటు నుంచి లీకవుతున్న నీరు

- ఎస్సారెస్పీ వరద గేటు ద్వారా లీకవుతున్న నీరు

బాల్కొండ : శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి ఎనిమిదో వరద గేటు ద్వారా నీరు లీకవుతోంది. ప్రాజెక్ట్ మిగులు జలాలు గోదావరిలోకి వదలడానికి 42 గేట్లను నిర్మించారు. రెండేళ్లుగా ఈ వరద గేట్ల మరమ్మతులు సాగుతున్నాయి. ఇందులో భాగంగా 8వ గేటుకు స్టాప్‌లాక్ గేటును బిగించి వరద గేటును ఓపెన్ చేశారు. కానీ స్టాప్‌లాక్ గేటును సక్రమంగా అమర్చకపోవడంతో నీరు లీకవుతోంది. వారం రోజులుగా లీకవుతున్న ప్రాజెక్ట్ అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. ప్రస్తుత సంవత్సరం ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు అంతంత మాత్రమే వచ్చింది. ఆ నీరు కూడా వరద గేట్ల ద్వారా నీరు గోదావరి పాలవుతుండటంపై ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రాజెక్ట్ నుంచి దాదాపుగా అన్ని గేట్ల ద్వారా స్వల్పంగా నీరు గోదావరిలోకి పోతుంది. కానీ 8వ గేటు నుంచి ఎక్కువ నీరు పోతోంది. ఎగువ నుంచి వరద మరింత పెరిగి నీటి నిల్వ పెరిగితే ఎక్కువ నీరు పోయే అవకాశం ఉంది. ప్రాజెక్ట్ అధికారులు స్పందించి నీరు వృథా పోకుండా చర్యలు చేపట్టాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు కొనసాగుతోంది. ప్రాజెక్ట్‌లోకి 3,583 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్ట్ నుంచి కాకతీయ కాలువ ద్వారా 2,750 క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 50 క్యూసెక్కులు, లక్ష్మి కాలువ ద్వారా 50 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 502 క్యూసెక్కులు, మిషన్ భగీరథ ద్వారా 231 క్యూసెక్కుల నీరుపోతోంది. పూర్తి స్థాయి నీటిమట్టం 1091 (80 టీఎంసీలు)అడుగులు కాగా ఆదివారం సాయంత్రానికి 1080.8 (47.25 టీఎంసీలు)అడుగుల నీరు నిల్వ ఉందని ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు.

పైసా లేనిదే పని ముట్టరు!

- మున్సిపల్ కార్పొరేషన్‌లో అవినీతి జోరు
- ఏ విభాగానికి వెళ్లినా చేతులు తడపాల్సిందే..
- ఏళ్లుగా పాతుకుపోయి జోరుగా అక్రమాలు



నిజామాబాద్‌అర్బన్: నగర మున్సిపల్ కార్పొరేషన్‌లోని ఏ విభాగానికి వెళ్లినా పైసా ఇవ్వనిదే పనిముట్టని పరిస్థితి ఉంది! ఏళ్లుగా తిష్టవేసిన ఉద్యోగులు ఆయా విభాగాలపై పట్టుసాధించి చక్రం తిప్పుతున్నారు. రిటైరైన కొందరు అవుట్‌సోర్సింగ్‌లో కొనసాగుతూనే ఉన్నారు. ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి వచ్చినా అవినీతి మాత్రం తగ్గలేదు. రెవెన్యూ అధికారి నరేందర్ ఇంట్లో ఇటీవల ఏసీబీ దాడుల నేపథ్యంలో నగరవాసులు 'కార్పొరేషన్' పనితీరుపైనే చర్చించుకుంటున్నారు.

ముఖ్యంగా రెవెన్యూ విభాగం పరిధిలో పన్ను వసూలు, లైసెన్సుల జారీలో జోరుగా వసూళ్లు సాగుతున్నాయి. అన్నీ నిబంధనల ప్రకారమే ఉన్నా డబ్బులు డిమాండ్ చేయకుండా ఉండడం లేదు. సంవత్సరాలుగా పన్ను చెల్లించని వారి వద్ద కొందరు అధికారులు డబ్బులు తీసుకుంటూ పన్ను మొత్తాన్ని తగ్గిస్తున్నారు. ఇదిలా ఉండగా, వ్యాపార లైసెన్సుల జారీ వరంలా మారింది. ఖలీల్‌వాడిలోని మున్సిపల్ కాంప్లెక్స్‌లో మడిగెలు గత కొన్ని సంవత్సరాలుగా కొందరికి మాత్రమే కొనసాగుతుండగా, పాతవారికే రెన్యువల్ చేస్తూ భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారు.

ఇంటి నిర్మాణాలు.. అపార్ట్‌మెంట్‌లు

నగరం రోజురోజుకూ విస్తరిస్తుండంతో శివారు ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణాలు జోరందుకున్నాయి. దీన్ని అవకాశంగా మల్చుకుంటున్న అధికారులు స్థానిక కార్పొరేటర్లతో కలిసి పెద్ద మొత్తంలో వసూళ్లకు పాల్పడుతున్నారని, డబ్బులు ఇవ్వకపోతే నిర్మాణలను నిలిపివేస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. ఒక ఏరియాలో ఇంటి నిర్మాణ ప్రారంభం కాగానే.. కార్పొరేటర్ అధికారులకు లేదా అధికారులు కార్పొరేటర్‌కు సమాచారం ఇచ్చిపుచ్చుకుని కలిసి డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఇక అపార్ట్‌మెంట్‌ల నిర్మాణాల్లో అయితే రూ.లక్ష నుంచి రూ.రెండు లక్షల వరకు వసూలు చేస్తూ నిబంధనలను గాలికి వదిలేస్తున్నారు. నగరంలో చాలా వరకు అపార్ట్‌మెంట్‌ల సెల్లార్లలోవ్యాపార సముదాయాలు కొనసాగుతున్నాయి. వీటిని నిరోధించాల్సిన అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. అక్రమ వెంచర్లు లక్షలు తెచ్చిపెడుతున్నాయి. అర్సపల్లి, ధర్మపురి హిల్స్, నాగారం తదితర ప్రాంతాల్లో అక్రమ వెంచర్లు జోరుగా కొనసాగుతున్నాయి.

పర్సంటేజీల్లో సిద్ధహస్తులు

కార్పొరేషన్ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనుల్లోనూ అవినీతి అధికారులు కొందరు పర్సంటేజీలు తీసుకుంటూ జేబులు నింపుకుంటున్నారు. ముఖ్యంగా డ్రెయినేజీలు, కల్వర్టుల నిర్మాణ పనుల మొత్తం 20శాతం వరకు అక్రమంగా వసూలు చేస్తున్నారు. హైమద్‌పురాకాలనీ, శాంతినగర్, మాలపల్లి, ధర్మపురి హిల్స్ తదితర ప్రాంతాల్లో డ్రెయినేజీలు నిర్మించకుండానే నిధులను మింగేసినా పట్టించుకునే వారు కరువయ్యారని పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ధర్మపురి హిల్స్ నుంచి బోధన్ రోడ్డు వరకు తారు రోడ్డు పనులు చేపట్టి పూర్తి కాకుండానే బిల్లులు పొందారు. కేవలం మూడు నెలల తర్వాత ఇదే రోడ్డును కొత్తగా వేసినట్టు మరో రూ.6.80లక్షలు బిల్లును పొందారు. రెండేళ్లలో హరితహారానికి రూ.20 కోట్లు వెచ్చించినట్లు చూపి, బోగస్ బిల్లులతో కోట్లాది రూపాయలను కార్పొరేటర్లతో కలిసి అధికారులు మింగేశారనే విమర్శలున్నాయి. వర్షాకాలంలో ఇబ్బందులు ఎదురవకుండా ముందుజాగ్రత్తగా ప్రధాన కాలువల మరమ్మతులు చేపట్టారు. అయితే, మాలపల్లి ప్రాంతంలో డి54 సబ్‌కాలువ మరమ్మతులు చేపట్టకుండానే పూర్తి స్థాయిలో బిల్లులు పొందినట్లు తెలిసింది. వేసవిలో నీటి సరఫరాకు సంబంధించి మరమ్మతుల బిల్లులను అక్రమంగా పొందినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇలా పనులు చేపట్టకుండా, చేయని పనులను చేసినట్లుగా చూపుతూ అధికారులు పర్సంటేజీలు తీసుకోవడంలో సిద్ధ హస్తులుగా మారారు.

పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేయాలి



మున్సిపల్ కార్పొరేషన్‌లో ప్రజలకు సరైన సేవలు అందాలంటే పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేయాలి. అవినీతి, అక్రమాలకు పాల్పడే అధికారులపై చర్యలు తీసుకోవడంతోపాటు ఏళ్లుగా తిష్ట వేసిన అధికారులను బదిలీ చేయాలి. అప్పుడే మెరుగైన సేవలు అందుతాయి. అన్ని విభాగల్లో అవినీతిని అరికట్టాలి.

– నాగభూషణం, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు

విత్తనోత్పత్తిపై దృష్టి

- యాసంగి కోసం ప్రణాళిక రూపొందిస్తున్న సంస్థ



మోర్తాడ్ : జిల్లాలో విత్తనోత్పత్తి కార్యక్రమానికి పూర్వ వైభవం తీసుకవచ్చే దిశగా రాష్ట్ర విత్తనోత్పత్తి కార్పొరేషన్ ప్రణాళిక రూపొందిస్తోంది. 2016కు ముందు వరి ఇతర పంటల విత్తనాల ఉత్పత్తిలో కీలక పాత్ర పోషించిన జిల్లా రైతాంగానికి సరైన విధంగా ప్రోత్సాహం అందించాలనే సంకల్పంతో విత్తనోత్పత్తి సంస్థ అడుగులు వేస్తోంది. సీడ్ కార్పొరేషన్ సంస్థకు బాల్కొండ నియోజకవర్గ నాయకుడు సుంకెట అన్వేష్‌రెడ్డి చైర్మన్‌గా ఎంపిక కావడంతో వచ్చే యాసంగి సీజనులో పెద్ద ఎత్తున విత్తనోత్పత్తి చేపట్టాలని సంస్థ ఉద్యోగులు లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు. చైర్మన్ సూచనలతో వరి, మొక్కజొన్న, సోయా తదితర పంటల విత్తనాలను ఉత్పత్తి చేసి రైతులకు మేలు రకమైన విత్తనాలను అందుబాటులోకి తీసుకు రావడానికి సమాలోచనలు జరుగుతుండటం విశేషం. తెలంగాణ ఆవిర్భావానికి ముందు ఆ తర్వాత రెండేళ్ల పాటు జిల్లాలో 25వేల క్వింటాళ్ల వరి విత్తనాన్ని రాయితీపై రైతులకు అందించేవారు. అప్పట్లో వెయ్యి ఎకరాల్లో విత్తనోత్పత్తి కార్యక్రమం కొనసాగేది. ఇప్పుడు కేవలం 400 క్వింటాళ్ల విత్తనం అందిస్తున్నారు. మొక్కజొన్న, సోయా విత్తనాల ఉత్పత్తి పూర్తిగా నిలిచిపోయింది. యాసంగి సీజనులో వరి, మొక్కజొన్న, సోయా విత్తనాలను రాయితీపై రైతులకు అందించి విత్తనోత్పత్తి కార్యక్రమం చేపట్టాలని భావిస్తున్నారు. ప్రతి ఏటా ఎంతో కొంత విస్తీర్ణం పెంచుతూ గతంలో కంటే భిన్నంగా విత్తనం ఉత్పత్తి చేయడం, సొంతంగా మార్కెటింగ్ చేయాలని ఆలోచన చేస్తున్నారు.

విత్తనోత్పత్తిని ప్రోత్సహిస్తాం



గత ప్రభుత్వం విత్తనోత్పత్తిని నిర్లక్ష్యం చేసింది. మా ప్రభుత్వం వ్యవసాయానికి వెన్నుదన్నుగా నిలవాలని ఆలోచన చేస్తుంది. ప్రైవేటు సీడ్ కంపెనీలకు దీటుగా విత్తనోత్పత్తి సంస్థ నుంచి రైతులకు మేలు రకాలైన విత్తనాలను అందుబాటులోకి తీసుకు వస్తాం. యాసంగి సీజను నుంచి ప్రణాళిక అమలు చేస్తాం.

– సుంకెట అన్వేష్‌రెడ్డి, సీడ్ కార్పొరేషన్ చైర్మన్

అక్షరం చిరకాలం నిలుస్తుంది

ఆర్మూర్‌టౌన్: సమాజంలో మార్పును సృష్టించే అక్షరం మాత్రమే చిరకాలం నిలిచిపోతుందని ప్రముఖ సినీ రచయిత, కవి, గాయకుడు తనికెళ్ల భరణి అన్నారు. యశస్వినీ సాహితీ సమితి ఆధ్వర్యంలో పట్టణంలోని బాలాజీ ఫంక్షన్‌హాలులో ఆదివారం నిర్వహించిన గ్రంథత్రయావిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పద్మకోకిల పద్యకళావాచస్పతి, పద్యగాన కళాస్పతి డాక్టర్ బోచ్కర్ ఓం ప్రకాశ్ రాసిన శ్రీయశస్విని, తిరుపతి వెంకట కవుల నానా రాజా సందర్శనం, రమణీయ పద్య ప్రకాశం సాహిత్య పుస్తకాలను తనికెళ్ల భరణి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆంగ్ల భాషపై వ్యామోహంతో అన్ని భాషల్లో కెల్లా గొప్పదైన తెలుగు భాషను ఈ తరం మరిచిపోతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు తెలుగు భాషను నేర్చుకునే విధంగా ప్రభుత్వాలు ప్రాముఖ్యతను కల్పించాలన్నారు. యశస్విని సాహితీ సమితి ఆధ్వర్యంలో బోచ్కర్ ఓం ప్రకాశ్ తెలుగు కీర్తిని ఇనుమడింపజేసే ప్రయత్నాలు చేయడం అభినందనీయమన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న తనికెళ్ల భరణి

ప్రతిఒక్కరూ తెలుగుపై అభిలాష పెంచుకోవాలన్నారు. అనంతరం కార్యక్రమ నిర్వాహకులతో పాటు పలువురు తనికెళ్ల భరణిని సన్మానించారు. శ్రీయశస్విని పురస్కారాలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ కసిరెడ్డి వెంకటరెడ్డి, డాక్టర్ అనంతకుమార్‌శర్మ, సాగి కమలాకరశర్మ, మరుమముల దత్తాత్రేయశర్మ, వెంకటరమణశర్మ, మంచినీళ్ల సరస్వతీ రామశర్మ, ప్రసాదం స్వాతి, రాజేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రేపు స్వాతంత్య్ర సమరయోధుల ఛాయాచిత్రాల ప్రదర్శన

నిజామాబాద్‌అర్బన్: సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్(సీబీసీ) ఆధ్వర్యంలో ఈ నెల 13, 14 తేదీల్లో తెలుగు స్వాతంత్య్ర సమర యోధులపై ఛాయాచిత్ర ప్రదర్శన ఉంటుందని సీబీసీ ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ బి.ధర్మ నాయక్ ఆదివారం తెలిపారు. జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని ఆడిటోరియంలో ఏర్పాటు చేసే ఈ ప్రదర్శనను ఉదయం 10:45 గంటలకు ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు ప్రారంభిస్తారని తెలిపారు. జిల్లాలోని యువత, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఎస్సారెస్పీలో పర్యాటకుల సందడి



బాల్కొండ: ఆదివారం సెలవు దినం కావడంతో శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌కు పర్యాటకులు పోటెత్తారు. ప్రాజెక్ట్ అందాలను తిలకిస్తు ప్రాజెక్ట్ నీటి అంచున ఉల్లాసంగా గడిపారు. పర్యాటకులకు కనీస సౌకర్యాలు కల్పించాలని, బోటింగ్ సదూపాయం ఏర్పాటు చేయాలని వారు అధికారులను డిమాండ్ చేశారు.

ప్రతిభ చాటిన గురుకుల పాఠశాల విద్యార్థులు

మాక్లూర్: టేబుల్ టెన్నిస్ అండర్–12 నుంచి అండర్–15 బాలబాలికల విభాగంలో ఆదివారం హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో మండలంలోని దాస్‌నగర్ వద్దగల మహాత్మా జ్యోతీబాపూలే గురుకుల పాఠశాల విద్యార్థులు పాల్గొని ప్రతిభ చాటారు. ఆగస్టు 5 నుంచి 11 వరకు రాష్ట్ర స్థాయి పోటీలు జరిగాయి. మొదటి రోజు జరిగిన పోటీల్లో పాఠశాలకు చెందిన 6వ తరగతి చదివే బి.సింధు ప్రథమ బహుమతి, ఎల్.ప్రవళిక ద్వితీయ బహుమతి, కె.అన్య తృతీయ బహుమతులను గెలుచుకున్నారు. అలాగే 7వ తరగతి చదివే సీహెచ్ జాహ్నవి బెస్ట్ ప్లేయర్‌గా నిలిచారు. గెలుపొందిన వారికి బహుమతులతో పాటు ప్రశంస పత్రాలను అందజేశారు. పాఠశాల పీడీ నీరజ, పీఈటీ రజితలు ఉన్నారు.

హిందువులను రక్షించాలి



బాల్కొండ: బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులను అరికట్టి, వారిని కాపాడాలని హిందూజన జాగరణ సమితి నాయకులు కోరారు. దాడులకు నిరసనగా ఆదివారం బాల్కొండలో వారు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. హిందువులపై జరుగుతున్న దాడులను ఖండించారు.

ముందుకు కదలని స్పైస్ పార్క్

- 2016లో స్పైస్ పార్క్‌కు శ్రీకారం చుట్టినా ఇప్పటికీ అమలు కాని క్రయ విక్రయాలు
- భూసేకరణ, ప్రహరీ నిర్మాణం, అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణంతో సరిపెట్టిన వైనం
- పసుపు సాగు చేసే రైతులను ప్రోత్సహించడంలో విఫలమవుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు



వేల్పూర్ క్రాస్ రోడ్డు వద్ద స్పైస్ పార్క్ కోసం సేకరించిన స్థలం

మోర్తాడ్(బాల్కొండ): పసుపు సాగు చేసే రైతులను అన్ని విధాలుగా ప్రోత్సహించడానికి స్పైస్ పార్క్ ఏర్పాటుకు అంకురార్పణ జరిగింది. కానీ కార్యాచరణ ఆరంభించకపోవడంతో అంతటా అసహనం వ్యక్తమవుతుంది. 2016లో గత ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంపై ఆధారపడకుండా తామే సొంతంగా పసుపు రైతులకు అండగా ఉంటామని ప్రకటించింది. బడ్జెట్‌లో రూ.30 కోట్లను కేటాయించి వేల్పూర్ క్రాస్ రోడ్డు వద్ద 75 ఎకరాల భూమిని సేకరించారు. మన జిల్లాతో పాటు నిర్మల్, జగిత్యాల్ జిల్లాల్లో సాగయ్యే పసుపు పంటను రైతులు ఒకే చోటకు చేర్చి విక్రయించడానికి స్పైస్ పార్క్ వేదికగా కొనసాగుతుందని ప్రభుత్వం వెల్లడించింది. పసుపు నిలువ కోసం గోదాములు, కోల్డ్ స్టోరేజీ, పసుపు శుద్ధి కోసం కర్మాగారం, క్రయ విక్రయాల కోసం షెడ్లు, రైతులు సేద తీరడానికి విశ్రాంతి మందిరం, వ్యాపారుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు ఈ పార్క్‌లో ఉంటాయని ప్రకటించింది. భూమిని సేకరించి ప్రహరీ, అంతర్గత సీసీ రోడ్లను నిర్మించారు. ఎనిమిది ఏళ్ల కింద స్పైస్ పార్క్‌కు అంకురార్పణ జరిగినా ఇప్పటి వరకు ఎలాంటి అడుగులు ముందుకు పడలేదు. ఎప్పటిలాగే రైతులు సాంగ్లీ, నిజామాబాద్, మెట్‌పల్లి మార్కెట్‌లలోనే పసుపు విక్రయాలను కొనసాగిస్తున్నారు.

బడా నేతలైనా పట్టించుకుంటారా..?

గత ప్రభుత్వం స్థల సేకరణతోనే సరిపెట్టింది తప్ప స్పైస్ పార్క్ గురించి గొప్పగా చెప్పిన ఒక్క మాట కూడా ఆచరణలో అమలు చేయలేదు. ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వంలో బాల్కొండకు చెందిన నేతలు రాష్ట్ర స్థాయిలో మంచి పదవుల్లో ఉన్నారు. మాజీ విప్ ఈరవత్రి అనిల్ రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్‌గా, మానాల మోహన్‌రెడ్డి రాష్ట్ర సహకార సంఘాల అసోసియేషన్ కార్పొరేషన్ చైర్మన్‌గా, సుంకెట్ అన్వేష్‌రెడ్డి రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్‌గా ఉన్నారు. కాంగ్రెస్ నేత సునీల్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డికి సన్నిహితుడిగా ఉన్నారు. ఈ నలుగురు నేతలు ప్రభుత్వాన్ని ఒప్పించి స్పైస్ పార్క్ కార్యాచరణ అమలు చేయడానికి అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తం అవుతుంది.

ఇప్పడైనా ఆరంభించాలి



రాబోయే సీజన్‌కు పసుపు క్రయ విక్రయాల కోసం స్పైస్ పార్క్‌ను ఆరంభించాలి. రైతులకు దూర భారం తప్పుతుంది. వ్యాపారులే ఇక్కడకు వస్తే ఎంతో మేలు జరుగుతుంది. మహిళా సంఘాలతో పసుపు ఆధారిత పరిశ్రమలను నిర్వహించాలి.
– దడివె మోహన్, రైతు, మోర్తాడ్

ఈ ప్రభుత్వమైనా పట్టించుకోవాలి



గత ప్రభుత్వం స్పైస్ పార్క్‌ను నిర్లక్ష్యం చేసింది. ఈ ప్రభుత్వమైనా పట్టించుకుని రైతులకు మేలు చేయాలి. స్పైస్ పార్క్‌లో అన్ని రకాల సేవలు అందుబాటులోకి తీసుకొస్తే రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. స్థానిక ప్రజాప్రతినిధులు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలి.
– సల్ల రాజేశ్వర్, రైతు, తొర్తి

హెడ్ రెగ్యులేటర్‌పై నిర్లక్ష్యం



గ్రీజు పూసి వదిలేసిన హెడ్‌రెగ్యులేటర్ గేట్లు

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ మిగులు జలాలను సద్వినియోగం చేసుకోవడానికి నిర్మించిన వరద కాలువ హెడ్‌రెగ్యులేటర్ నిర్వహణపై ప్రాజెక్ట్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిన్నారు. వరద కాలువ ద్వారా నీటి విడుదల కోసం ఆరు గేట్లతో హెడ్‌రెగ్యులేటర్ నిర్మించారు. వరద గేట్ల నిర్వహణలో భాగంగా గేట్లకు గ్రీజు, ఆయిల్ వేశారు. కాని వాటి కవర్ బాక్సులు మళ్లీ బిగించడం మరిచారు. దీంతో వర్షం కురిస్తే తుప్పు పట్టి గేట్లు శిథిలమవుతున్నాయి. వరద గేట్ల నిర్వహణకు, కాలువ నీటి నిర్వహణకు ప్రత్యేకంగా విభాగాలు ఉన్నాయి. వరద కాలువ అధికారులకు వరద కాలువ మొరం తరలించడంపై ఉన్న శ్రద్ధ గేట్ల నిర్వహణపై లేదు. ఉన్నత అధికారులు స్పందించి గేట్ల కవర్ బాక్సులు వెంటనే బిగించేలా చర్యలు తీసుకోవాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

కాలువ ధ్వంసం..

వరద కాలువ హెడ్‌రెగ్యులేటర్ వద్ద, లోపలి భాగం పూర్తిగా ధ్వంసమైంది. సిమెంట్ పెచ్చులు పూర్తిగా లేచి ప్రవాహానికి అడ్డుగా పడ్డాయి. ప్రస్తుతం వరద కాలువ కాళేశ్వరం నీరు రివర్స్ పంపింగ్ ద్వారా ఎస్సారెస్పీకి తీసుకురావడానికి ఉపయోగపడుతోంది. అంతే కాకుండా మిగులు జలాలను మళ్లించటానికి ఉపయోగపడుతుంది. వరద కాలువలో కొట్టుకుపోయిన భాగానికి మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఎంతో ఉంది. లేదంటే కాలువకు గండి పడే ప్రమాదం లేకపోలేదు. ఉన్నత అధికారులు స్పందించాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

పారిశ్రామికవేత్త రాజారెడ్డి మృతి



గడ్డం రాజారెడ్డి (ఫైల్)



రాజారెడ్డి పార్థీవదేహం వద్ద నివాళులర్పిస్తున్న బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి

పెర్కిట్(ఆర్మూర్): ప్రముఖ పారిశ్రామికవేత్త గడ్డం రాజా రెడ్డి(84) శనివారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. ఆర్మూర్ మండలం అంకాపూర్ లాలన వృద్ధాశ్రమంలో ఆదివారం నిర్వహించిన ఆయన అంత్యక్రియల్లో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంతకండ్ల జగదీశ్వర్ రెడ్డి, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి తదితరులు రాజారెడ్డి పార్థీవ దేహాన్ని సందర్శించుకుని ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. లాలన వృద్ధాశ్రమం నెలకొల్పి మలిదశలో ఉన్న వృద్ధులకు సేవలందిస్తున్న రాజారెడ్డి మృతి సమాజానికి తీరని లోటన్నారు. అలాగే ఎందరో పేద విద్యార్థుల ఉన్నత విద్యలకు చేయూతనందించిన రాజారెడ్డి సేవలు అనిర్వచనీయమైనవన్నారు. అంత్యక్రియల్లో రాజారెడ్డి సోదరి విజయ్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ అమృతలత, కాంగ్రెస్ నేత పొద్దుటూరి వినయ్ రెడ్డి, ప్రముఖ న్యాయవాది రాజేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రూ.3 కోట్లతో పాఠశాల అభివృద్ధి

జక్రాన్‌పల్లి: ఎవరో రావాలి ఏదో చేయాలి అని ఎదురు చూడకుండా, చేయి చేయి కలిపారు. సమిష్టిగా జక్రాన్‌పల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలను అభివృద్ధి చేయాలని తలంచారు. అనుకున్నదే తడవుగా లాలన వృద్ధాశ్రమ వ్యవస్థాపకుడు, ప్రముఖ వ్యాపారవేత్త పైపుల గడ్డం రాజారెడ్డి అందుకు కేంద్రబిందువుగా నిలిచారు. తాను చదువుకున్న పాఠశాలను అభివృద్ధి చేయాలని సదుద్దేశంతో 2023 ఫిబ్రవరి 23న పాఠశాల పునఃనిర్మాణం కోసం అంకురార్పణ చేశారు. పాఠశాలలో స్కూల్ డెవలప్‌మెంట్ కమిటీ చైర్మన్‌గా పైపుల రాజారెడ్డి, సభ్యులుగా పీడీ ఉమామహేశ్వర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు గంగారెడ్డి, ఉపసర్పంచ్ బాల్‌కిషన్, డాక్టర్ సుభాష్‌లతో కమిటీని ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు రాజారెడ్డి పాఠశాల అభివృద్ధి కోసం అవిశ్రాంతంగా కృషి చేశారు. అందుకు గ్రామాభివృద్ధి కమిటీ, కుల సంఘాల సహకారం తోడైంది. వ్యాపారవేత్త రాజారెడ్డి రూ. కోటి నగదును అందించగా వారి కుటుంబసభ్యులు మరో రూ.75 లక్షలను అందజేశారు. మరికొంత మంది దాతల సహకారంతో సుమారు రూ. 3కోట్లతో పాఠశాలను అభివృద్ధి చేశారు. మంత్రి దామోదర రాజనరసింహ ముఖ్య అతిథిగా హాజరై పాఠశాలను ప్రారంభించారు.

జక్రాన్‌పల్లివాసులకు తీరని లోటు

పైపుల రాజారెడ్డి స్వస్థలం జక్రాన్‌పల్లి మండల కేంద్రం. కానీ అంకాపూర్‌లో లాలన వృద్ధాశ్రమం స్థాపించి ఎంతో మంది వృద్ధులకు ఆశ్రయం కల్పించి ఆదుకుంటున్నారు. జక్రాన్‌పల్లి మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారు. ఆయన మరణం జక్రాన్‌పల్లివాసులకు తీరని లోటు. మండలంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

విద్యుత్ సంస్థ ఉత్తమ అధికారులు

సుభాష్‌నగర్: విద్యుత్ సంస్థ ప్రతినెలా మార్కుల ఆధారంగా ప్రకటించే ఉత్తమ అధికారులను జూన్ మాసానికి టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి ఆదివారం ప్రకటించారు. గ్రామీణ ప్రాంతంలో ఉత్తమ ఏఈగా నాయిని కృష్ణ(కోటగిరి), పట్టణ ప్రాంతం నుంచి కే.జ్యోతి(కామారెడ్డి), ఏడీఈగా శ్రీధర్(ఆర్మూర్), ఉత్తమ డీఈగా ఎం.శ్రీనివాస్(నిజామాబాద్), నిజామాబాద్ ఉత్తమ ఎస్‌ఈగా ఆర్ రవీందర్(ఎస్సీ ఆపరేషన్), ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఉత్తమ ఏఈగా నగేష్(డీ–1 టౌన్), ఉత్తమ ఏడీఈగా తోట రాజశేఖర్(టౌన్–2), నిజామాబాద్ పట్టణం, ఉత్తమ డీఈగా సీహెచ్ హరిచంద్ర నాయక్, ఉత్తమ ఇంప్రూవర్ అధికారులుగా ఎండీ హజర్(ఏఈ, నిజామాబాద్), వినోద్ కుమార్(డీఈ, మోర్తాడ్), టీటీ బెనర్జీ (ఏడీఈ బోధన్ టౌన్), ఎండీ ముక్తార్(డీఈ బోధన్)లను ప్రకటించారు. అలాగే జూలై మాసానికి ఉత్తమ అధికారులుగా గ్రామీణం ఏఈలు సత్య ప్రసాద్(మోర్తాడ్), పి.శ్రీనివాస్(గొట్టుముక్కల), ప్రవీణ్ కుమార్(నవీపేట్), ఉత్తమ పట్టణ ఏఈలుగా గంగాశేఖర్(సుభాష్ నగర్), గ్రామీణ ఏడీఈలుగా సుహాసిని(నవీపేట్), ఉత్తమ ఎస్సీగా ఆర్ రవీందర్(ఆపరేషన్ నిజామాబాద్), ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఉత్తమ పట్టణ ఏఈగా ఆర్ సుమిత(డీ2), ఉత్తమ రూరల్ ఏడీఈగా ఎం.అశోక్ (నందిపేట్), ఉత్తమ పట్టణ ఏడీఈగా తోట రాజశేఖర్(టౌన్ 2 నిజామాబాద్), ఉత్తమ డీఈగా ఎం. శ్రీనివాస్(నిజామాబాద్), జిల్లా స్థాయి ఏఈ సత్యప్రసాద్ (మోర్తాడ్), తదితరులను ప్రకటించారు.

టీటీడీలో కూలిన రిటైనింగ్ వాల్



బాన్సువాడ: ఇటీవల పక్షం రోజుల పాటు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు బీర్కూర్‌లోని తెలంగాణ తిరుమల దేవస్థానం గుట్టపై రిటైనింగ్ వాల్ కూలిపోయింది. వర్షాలకు మట్టి కుంగిపోయి ఆదివారం తెల్లవారుజామున సుమారు 30 ఫీట్ల వరకు గోడకూలి మట్టి కిందికి జారింది. ఆ సమయంలో భక్తులెవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. శనివారం ఆలయం వద్ద ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఆగ్రోస్ ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజుతో కలిసి ఆలయంలో చండీయాగం చేయించారు. ఆ సమయంలో భక్తులతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. ఆ సమయంలో గోడకూలితే భక్తులకు ప్రాణనష్టం వాటిల్లేదని స్థానికులు చర్చించుకుంటున్నారు. రిటైనింగ్ వాల్ కూలిపోయిన విషయం తెల్సుకున్న నిర్వాహకులు ఆలయంలోకి భక్తులను అనుమతించకుండా అప్పటికప్పుడు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేయిస్తున్నారు. 2022లో తెలంగాణ ప్రభుత్వం రూ.23 కోట్ల నిధులతో ఆలయాన్ని పునర్నిర్మించగా అప్పటి సీఎం కేసీఆర్, స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు.

ప్రతి ఇంటిపై జాతీయ పతాకం ఎగురవేయాలి

- స్వాతంత్య్ర సమరయోధుల త్యాగాలు స్మరించుకోవడం అందరి బాధ్యత
- కామారెడ్డి శాసన సభ్యుడు కాటిపల్లి వెంకటరమణారెడ్డి



జాతీయ పతాకాలను అందజేస్తున్న ఎమ్మెల్యే

దోమకొండ: ఆగస్టు 15న స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా బీజేపీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని కామారెడ్డి శాసనసభ్యులు కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. దోమకొండ మండల కేంద్రంలోని 6వ వార్డు పరిధిలో ఇంటింటికీ జాతీయ జెండా అందజేసి మాట్లాడారు. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా గౌరవ ప్రధాని నరేంద్ర మోదీ సూచన మేరకు నియోజకవర్గం పరిధిలో ప్రతి ఇంటిపై జాతీయ పతాకం ఉండాలని సూచించారు. స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా స్వాతంత్ర సమర యోధుల త్యాగాలు స్మరించుకోవడం అందరి బాధ్యత అని గుర్తు చేశారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమం ప్రతి గ్రామంలో నిర్వహించాలనీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



దోమకొండలో కలుసుకున్న జెడ్పీహెచ్‌ఎస్ 1973-74 బ్యాచ్ విద్యార్థులు

దోమకొండ: మండల కేంద్రంలోని పైడిమర్రి ఫంక్షన్ హాల్‌లో ఆదివారం దోమకొండ జెడ్పీహెచ్‌ఎస్ 1973–74 బ్యాచ్ పదవ తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. యాభైఏళ్ల తర్వాత ఒకే వేదికపై కలుసుకొని ఒకరినొకరు యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ప్రముఖులకు సన్మానం చేశారు. మాజీ జెడ్పీటీసీ తీగల్ తిర్మల్ గౌడ్, గురువులు దయాకర్ రావ్, బాల్ రెడ్డి, రాజలింగం, దేవేందర్ రావు, సుంచు గోవర్ధన్, బొద్దుల రాం చెంద్రం, అశోక్, సత్య నందు, మూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్రీనూతన వైశ్య ఉన్నత పాఠశాల విద్యార్థులు

నిజామాబాద్‌అర్బన్: నగరంలోని శివాజీనగర్‌లో ఆదివారం శ్రీ నూతన వైశ్య ఉన్నత పాఠశాల(మాణిక్‌భవన్) 2003–04 పదవ తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. 20 సంవత్సరాల తర్వాత ఒకే వేదికపై కలుసుకోవడం ఆనందంగా ఉందని వారు తెలిపారు. గురువులను ఘనంగా సన్మానించారు. ఆటపాటలతో నృత్యాలు చేసి ఆనందంగా గడిపారు.



శివాజీ నగర్‌లో కలుసుకున్న 2003-04 బ్యాచ్ శ్రీనూతన వైశ్య పాఠశాల పదో తరగతి విద్యార్థులు

వైద్యారోగ్యశాఖలో మళ్లీ డిప్యుటేషన్లు!

నిజామాబాద్ నాగారం: వైద్యారోగ్యశాఖలో డిప్యుటేషన్ల అంశం మళ్లీ తెరపైకి వచ్చింది. వైద్యారోగ్యశాఖ సెక్రెటరీ క్రిస్టినా జెడ్ చోంగ్తూ డిప్యుటేషన్లను రద్దు చేయగా, డీఎంహెచ్‌వోగా రాజశ్రీ బాధ్యతలు చేపట్టి పది రోజులు గడవక ముందే మళ్లీ డిప్యుటేషన్ల అంశం తెరపైకి వచ్చింది. అత్యవసరమైన ప్రాంతాల్లో డిప్యుటేషన్లు వేసేందుకు ప్రక్రియ సిద్ధం చేస్తున్నారని తెలుసుకున్న ఉద్యోగులు పైరవీలను ప్రారంభించారు.

అధికారులకు తలనొప్పి

గతంలో డిప్యుటేషన్లకు సంబంధించిన అధికారం జిల్లా వైద్యారోగ్యశాధికారులకే ఉండేది. అయితే, కొందరు అధికారులు దుర్వినియోగం చేయడంతో రాష్ట్ర వైద్యారోగ్యశాఖ కార్యదర్శి క్రిస్టినా జెడ్ చోంగ్తూ డిప్యుటేషన్లను రద్దు చేశారు. అత్యవసరమైతే కలెక్టర్ అనుమతి తీసుకోవాలని స్పష్టమైన ఆదేశాలిచ్చారు. ఇది కొంతమంది అధికారులకు మింగుపడటం లేదు. ఎలాగైనా డిప్యుటేషన్లు తెచ్చుకోవడానికి విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. గతంలో కలెక్టర్ వద్ద ఉన్న 70 మందితో కూడిన జాబితా డిప్యుటేషన్ల కోసం ఉండగా, ఆ తరువాత డిప్యుటేషన్లు రద్దయిన విషయం తెలిసిందే. దీంతో డిప్యుటేషన్‌పై ఇతర జిల్లాల నుంచి వచ్చినవారు సొంత జిల్లాలకు వెళ్లారు. ఇతర జిల్లాలో ఉన్న వారు మన జిల్లాకు వచ్చారు. ఇటీవల వైద్యారోగ్యశాఖలో చాలా పోస్టులు ఖాళీ కావడంతో డిప్యుటేషన్లు తప్పనిసరైంది.

కలెక్టర్ అనుమతి ఇస్తేనే..

జిల్లా కలెక్టర్ అనుమతిస్తేనే డిప్యుటేషన్లు ఇచ్చే అవకాశం ఉంటుంది. అధికారులు మాత్రం జాబితాను సిద్ధం చేస్తుండగా ఉద్యోగులు పైరవీలు ప్రారంభించడంతో తలలు పట్టుకుంటున్నారు. గతంలో డిప్యుటేషన్‌పై విధులు నిర్వర్తించిన వారి పేర్లను మళ్లీ జాబితాలో పెట్టే ప్రయత్నాలు జరుగుతున్నట్లు సమాచారం. దీనిపై జిల్లా అధికారి ప్రత్యేక దృష్టి సారిస్తే కొత్త వారికి డిప్యుటేషన్ వచ్చే అవకాశం ఉంది.

క్రైం కార్నర్

కుటుంబ కలహాలతో ఆత్మహత్య

ఖలీల్‌వాడి: నగరంలోని ఐదవ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆనంద్‌నగర్‌కు చెందిన కమల్ సింగ్(40) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఆదివారం ఎస్సై వెంకట్రావు తెలిపారు. వివరాలు.. మధ్యప్రదేశ్‌కు చెందిన కమల్ సింగ్ ఆనంద్‌నగర్‌లో కుటుంబ సభ్యులతో ఉంటున్నాడు. శనివారం భార్యతో గొడవపడి అదే కాలనీలో ఉండే తల్లిదండ్రుల వద్దకు వచ్చాడు. భార్యతో కొట్లాట విషయంలో మనస్తాపం చెంది పురుగుల మందు సేవించి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అదృశ్యమయ్యాడు.. గోదావరిలో శవమై తేలాడు

ఖలీల్ వాడి: నగరంలోని వినాయక్ నగర్‌కు చెందిన కల్లెపల్లి రాజు(36) నిర్మల్ జిల్లా బాసర వద్ద గోదావరిలో పడి మృతి చెందినట్లు పోలీసుల తెలిపారు. ఈ నెల 3న కుటుంబ కలహాలతో ఇంట్లో నుంచి రాజు వెళ్లిపోయాడని కుటుంబసభ్యులు తెలిపారు. దీంతో కుటుంబ సభ్యులు నాలుగో టౌన్‌లో ఫిర్యాదు చేశారు. రాజు ఆచూకీ కోసం కుటుంబీకులు, పోలీసులు గాలించగా ఆదివారం బాసర వద్ద గోదావరి నదిలో శవమై కనిపించాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

'ఇండిపెండెన్స్ డే' లింకులు ఓపెన్ చేయొద్దు

ఖలీల్‌వాడి: సైబర్ నేరగాళ్లు స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా 'హ్యాపీ ఇండిపెండెన్స్ డే' అంటూ మెసేజులు, ఫోన్ పే, గూగుల్ పే ద్వారా రివార్డులు వచ్చాయని, లింకులు పంపిస్తారని వాటిని నమ్మవద్దని నిజామాబాద్ టౌన్ సీఐ నరహరి ఆదివారం తెలిపారు. ఈ లింకులు ఓపెన్ చేస్తే డబ్బులు మాయం అవుతాయన్నారు. ఇండిపెండెన్స్ డే సందర్భంగా ఎవరూ క్యాష్ బ్యాక్ పంపరని, వాటి నమ్మొద్దని చెప్పారు.

రైలులో పటిక, బెల్లం పట్టివేత

ఖలీల్‌వాడి: నిజామాబాద్‌రైల్వేస్టేషన్‌లో రైలు బోగీలో ఉన్న మూడు సంచుల బెల్లం, ఏడు పటిక సంచులను పట్టుకున్నట్లు ఆర్‌పీఎఫ్ సీఐ సుబ్బారావు ఆదివారం తెలిపారు. ఎస్–5 బోగీలో సీటు కింద ఉన్నట్లు చెప్పారు. కేంద్ర రైల్వేశాఖ ప్రవేశపెట్టిన సత్కార్‌లో భాగంగా రైల్వేలో స్పెషల్ రైల్వే పోలీసులు తనిఖీలు చేపట్టినట్లు చెప్పారు. వీటి విలువ రూ.19,600 ఉంటుందన్నారు. కేసు నమోదు చేశామని, బెల్లం, పట్టికను ఎక్సైజ్‌శాఖకు అందించినట్లు తెలిపారు.

నగరంలో గుట్కా..

ఖలీల్‌వాడి: నగరంలోని నాలుగో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో టాస్క్ ఫోర్స్ పోలీసులు సీఐ పురుషోత్తం ఆధ్వర్యంలో ఆదివారం తనిఖీలు నిర్వహించారు. ఇంట్లో దాచిన రూ.40 వేల విలువైన గుట్కా ప్యాకెట్లను సీజ్ చేశారు. అనంతరం నాలుగో టౌన్ పోలీసులకు అప్పగించారు. పోలీసులు లక్ష్మన్న, రాములు, గజేందర్, అనిల్ కుమార్, నర్సయ్య, ఆజాం పాల్గొన్నారు.

నవీపేటలో మొరం టిప్పర్..

నవీపేట: మండలంలోని ఫతేనగర్ శివారు నుంచి నవీపేట వైపు వస్తున్న మొరం టిప్పర్‌ను శనివారం రాత్రి పట్టుకున్నట్లు ఎస్సై యాదగిరిగౌడ్ ఆదివారం తెలిపారు. నవీపేటకు చెందిన టిప్పర్ యజమాని అజ్జు ఎలాంటి అనుమతులు లేకుండానే అక్రమంగా మొరం తరలిస్తున్నారని ఫిర్యాదు రావడంతో పట్టుకున్నామని పేర్కొన్నారు. అనుమతులు లేకుండా మొరం తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

పేకాట స్థావరాలపై దాడి

బోధన్‌రూరల్: చిన్న మావంది శివారులో ఆదివారం పేకాట స్థావరంపై దాడి నిర్వహించి, ఏడుగురు పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసినట్లు బోధన్ రూరల్ ఎస్సై నాగనాథ్ తెలిపారు. పట్టుబడిన వారి వద్ద నుంచి రూ.2,510లు నగదు స్వాధీనం చేసుకుని కేస్ నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

నిజామాబాద్ నగరంలో..

ఖలీల్‌వాడి: నగరంలోని నాలుగో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం ఏసీపీ విష్ణుమూర్తి ఆధ్వర్యంలో సీఐ పురుషోత్తం దాడులు నిర్వహించారు. 11 మందిని అరెస్ట్ చేసి వారి నుంచి 8 సెల్ ఫోన్లు, రూ.10,140 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నాలుగో టౌన్ పోలీసులు తెలిపారు.

గుంత యమపాశమైంది



నిజాంసాగర్(జుక్కల్): పశువులను కడగడానికి ఆదివారం ఊర చెరువులోకి వెళ్లిన నంగి ప్రభు(38) అనే పశువుల కాపరి ప్రమాదవశాత్తూ గుంతలో మునిగి మృతి చెందాడు. ప్రభు స్వగ్రామం నర్సింగ్‌రామ్‌పల్లి. నీటిలో మునుగుతున్న సమయంలో మరి కొందరు పశువుల కాపర్లు ఉన్నా ఆయనను రక్షించలేకపోయారు. చెరువులో ఇటీవల అక్రమంగా మట్టి తవ్వకాలు చేపట్టడంతో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడినట్లు స్థానికులు చెబుతున్నారు. మృతుడి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహానికి పంచనామా నిర్వహించినట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఖలీల్ వాడి: నగరంలోని ఆరో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ధర్మపురిహిల్స్ రోడ్డులో ఓ ఇంటి ముందు గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఉన్నట్లు స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. మృతుడి వయస్సు సుమారు 45 ఏళ్లు ఉంటుందని, ఎవరైనా వ్యక్తులు అదృశ్యమైతే ఆరో టౌన్ పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.